క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 10న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. శాంతినగర్, కరీమాబాద్ రోడ్డు, రామాలయం, లక్ష్మినగర్, మై మాస్టర్ స్కూల్, బుడగజంగాల కాలనీ, రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంతం, గణేష్‌నగర్, గవిచర్ల క్రాస్‌రోడ్డు, బొల్లికుంట ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ముళ్లపొదలు తొలగించారు



సాక్షి స్పందన

మడికొండ: మడికొండలో జనావాసాల్లో ఉన్న పలు ఖాళీ స్థలాల్లోని ముళ్లపొదలు, పిచ్చిమొక్కలను యజమానులు తొలగించారు. సాక్షిలో ఆదివారం ప్రచురితమైన 'జనావాసాల్లో ముళ్ల పొదలు' అనే కథనానికి స్పందించారు. ఈసందర్భంగా జేసీబీ సాయంతో ఖాళీ స్థలాల్లో ముళ్లపొదలను యజమానులు సోమవారం చదును చేయించారు.

టీఎస్ ఐసెట్ కన్వీనర్‌కు సన్మానం



కేయూ క్యాంపస్: టీఎస్ ఐసెట్ కన్వీనర్‌గా నియామకం అయిన కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.వరలక్ష్మిని కాకతీయ యూనివర్సిటీ ఆల్‌మాల స్టూడెంట్స్ అసోసియేషన్ బాధ్యులు కళాశాలలో సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో కేయూ జువాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ వై.వెంకయ్య, ప్రొఫెసర్లు బ్రహ్మేశ్వరి, డాక్టర్ మంజుల, డాక్టర్ వెంకటగోపీనాథ్, డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, డాక్టర్ సురేష్, డాక్టర్ కృష్ణ, అనిల్, చందు, జగన్, రాజేందర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



ఖిలా వరంగల్: ఈనెల 18నుంచి ప్రభుత్వం నిర్వహించనున్న కంటి వెలుగు పథకాన్ని ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ విలాసాగరం అనూష సూచించారు. 37, 38, 41 డివిజన్ల కార్పొరేటర్లు వేల్పుగొండ సువర్ణ, బైరబోయిన ఉమ, పోశాల పద్మ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నేతృత్వంలో సోమవారం జరిగిన సమావేశంలో డాక్టర్ అనూష మాట్లాడారు. 18 ఏళ్లు పైబడిన వారందరికీ ప్రభుత్వం ఉచితంగా అన్ని రకాల కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సురేష్, స్వామి, దామోదర్ యాదవ్, ఏఎన్ఎంలు రాణి, రేష్మ, ఆశ కార్యకర్తలు కవిత, స్వర్ణ, వందన, రాధిక, రజిత, పాల్గొన్నారు.

15వ సారి రక్తదానం



హన్మకొండ అర్బన్: స్వామి వివేకానంద 161వ జయంతి (జాతీయ యువజన దినోత్సవం) సందర్భంగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సామాజిక సేవకుడు, యువ నేతాజీ ఫౌండేషన్ సభ్యుడు గజ్జెల సుమన్.. 15వ సారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. తలసీమియా పిల్లల కోసం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేసి పలువురి ప్రశంసలు పొందారు. ఈ సందర్భంగా వరంగల్ అదనపు కలెక్టర్ శ్రీవత్స కోట, బీజేపీ నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రెడ్‌క్రాస్ చైర్మన్ విజయ్‌చందర్ రెడ్డి, సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్, దేవునూరి ఆనంద్, డాక్టర్ శ్రవణ్ నుంచి పత్రం అందుకున్నారు.

బాధితుల నిరాహార దీక్ష



కాజీపేట: కాజీపేట 47వ డివిజన్ ప్రధాన రహదారిపై ఓ కుటుంబం సోమవారం నిరాహార దీక్ష చేపట్టడం చర్చనీయంశంగా మారింది. తమకు న్యాయంగా దక్కాల్సిన ఇంటి స్థలాన్ని బంధువులే కబ్జా చేసి ముప్పుతిప్పలు పెడుతుండడంపై ఆవేదన వ్యక్తం చేస్తూ నిరాహార దీక్షకు కూర్చున్నారు. కబ్జాదారుల చెర నుంచి ఇంటి నివేశన స్థలాన్ని ఇప్పించాలని డిమాండ్ చేశారు. దాంతో పోలీసులు జోక్యం చేసుకుని న్యాయం చేస్తామని చెప్పడంతో దీక్ష విరమించారు. కార్యక్రమంలో ఇద్దరు మానసిక వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



హసన్‌పర్తి: పతకాలు సాధించిన విద్యార్థులు



బంగారు పతకం అందుకుంటున్న ఎండి.ఆసియా

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ మైదానంలో ఆదివారం ముగిసిన రెండవ జాతీయ ఓపెన్ కరాటే పోటీల్లో ఎల్లాపురం చోటోకాన్ కరాటే అకాడమీ క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. సిటోరియో అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విషిత రెడ్డి, హరీష్.. సిల్వర్ మెడల్, వి.సాయి, ప్రజ్ఞ, ఆర్.రణ్వీ, మహేందర్.. కాంస్య పతకాలు సాధించినట్లు కోచ్ రేణుకుంట్ల దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఎల్లాపురంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వారిని పలువురు అభినందించారు.

కరాటేలో షిటోరియె అకాడమీకి పతకాలు

వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 8న పెద్దపల్లి జిల్లా కాలశ్రీరాంపూర్‌లో డ్రాగన్స్ కుంగ్‌ఫూ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో హనుమకొండ దమ్మికా కాయ్ షిటోరియె అకాడమీ క్రీడాకారులు పతకాలతో అదరగొట్టారు. ఆరు రాష్ట్రాల నుంచి 600మంది పాల్గొన్న చాంపియన్‌షిప్‌లో హనుమకొండ క్రీడాకారులు కుమిటి, కటాస్ విభాగాల్లో బంగారు, వెండి పతకాలు సాధించినట్లు అకాడమీ చీఫ్ బండారి సంతోష్ తెలిపారు. ఎం.శ్రీహర్ష, అనన్య, మణిదీప్, గౌస్, సహస్ర, రుషిక్ మానస్, సుదీక్ష, హరిమతస్, ఇర్ఫాన్, ఎండి.ఆసియా.. కుమిటిలో బంగారు పతకాలు సాధించగా, హిమశ్రీ, అరుష్, జినత్, దేవాన్ష్, వైభవ్, సిద్ధార్థ్, అక్షర, వేదాంత్.. కటాస్ విభాగంలో వెండి పతకాలు సాధించారని సంతోష్ వివరించారు. ఈ సందర్భంగా వారికి అకాడమీ బాధ్యులు అభినందించారు.

తోళ్ల కార్మికుడిపై దాడి శోచనీయం



సమావేశంలో మాట్లాడుతున్న యాకేందర్

వరంగల్: దేశాయిపేటలోని పర్ఫెక్ట్ ట్యానరీలో 25ఏళ్లుగా తోళ్ల కార్మికుడిగా పనిచేస్తున్న జన్ను స్వామిపై ఫ్యాక్టరీ యజమాని మహ్మద్ యూసుఫ్, కుమారుడు ముస్తాఫా చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ట్యానరీ, లెదర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కొత్తూరి యాకేందర్ తెలిపారు. దేశాయిపేట ఎస్ఆర్‌భవన్‌లో సోమవారం జరిగిన యూనియన్ సమావేశంలో యాకేందర్ మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ బోనస్ కావాలని దళిత కార్మికుడు అడగగా, ఇవ్వబోనని చెప్పి మరొకరితో అతని పనిని చేయిస్తూ పరిశ్రమ యజమాని దౌర్జన్యం చేశారని ఆరోపించారు. కులం పేరుతో దూషించి అవమానపరిచి, కార్ఖానాలో అడుగుపెడితే చంపేస్తానని బెదిరించిన తండ్రి కొడుకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్టు కింద కేసు నమోదు అయినట్లు చెప్పారు. కార్మికుడిపై దాడి చేసిన మహ్మద్ యూసుఫ్, ముస్తఫాలను శిక్షించాలని, బాధితుడికి న్యాయం జరిగే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ అఫ్రోజ్, ట్రెజరర్ జన్ను సుశీరాజ్, ఉపాధ్యక్షుడు తాళ్ల అశోక్, కార్యదర్శి జన్ను అనిల్‌కుమార్, యూనియన్ నాయకులు సుధాకర్, స్వామి, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బీసీ ఉద్యోగుల డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న గోపాల్‌రావు, డైరెక్టర్లు

హన్మకొండ: హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో విద్యుత్ బీసీ ఉద్యోగుల నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు, డైరెక్టర్లు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర్ రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్‌రెడ్డి, వి.తిరుపతి రెడ్డి, తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం డిస్కం అధ్యక్షుడు సదానందం, కార్యదర్శి రాజేందర్, సీజీఎంలు టి.మధుసూదన్, కె.కిషన్, సి.ప్రభాకర్, జీఎంలు శ్రీనివాస్, మనోహర స్వామి, కంపెనీ సెక్రటరీ కె.వెంకటేశం, వరంగల్ ఎస్ఈ మధుసూదన్ రావు, అధికారులు మహేందర్, భాస్కర్, హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

డీసీసీబీ క్యాలెండర్..

మడికొండ: కాజీపేట మండలం మడికొండ డీసీసీ బ్యాంక్‌శాఖలో నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని కాజీపేట దర్గా సొసైటీ చైర్మన్ ఊకంటి వనం రెడ్డి, బ్యాంక్ మేనేజర్ జీవన్ సోమవారంఆవిష్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ స్వాతి, సొసైటీ వైస్ చైర్మన్ మాదాసు బాబు, ఫీల్డ్ ఆఫీసర్ రాజేష్, శ్రీలత, దర్గా సొసైటీ డైరెక్టర్లు తంపుల రమరాజేందర్, దువ్వ శ్రీకాంత్, పుల్యాల సంపత్‌రెడ్డి, బేతి భూపాల్‌రెడ్డి, సుల్తాన్, వెంకన్న, జ్యోతిరెడ్డి, రజినీకర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, నాయకులు నర్మెట భిక్షపతి, తదురు అనిల్, కుమార్‌రాజ, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజం అందరి బాధ్యత



కిట్లు పంపిణీ చేస్తున్న హిమబిందు, సత్యప్రకాష్

కాజీపేట రూరల్: ప్రతీఒక్కరు టీబీ రహిత సమాజం కోసం కలిసికట్టుగా కృషి చేయాలని హనుమకొండ జిల్లా టీబీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ హిమబిందు అన్నారు. కాజీపేట ఫాతిమానగర్‌లోని సర్వప్రేమ వెల్ఫేర్ సొసైటీ ప్రాంగణంలో సామాజిక కార్యకర్త జి.సత్యప్రకాష్ 30మంది టీబీ పేషెంట్లకు న్యూట్రిషన్ కిట్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ టీబీ నివారణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం చేపట్టిందని వివరించారు. టీబీ పేషెంట్లకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేసిన సత్యప్రకాష్‌ను ఆమె అభినందించారు. సర్వప్రేమ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.బాలస్వామిరెడ్డి, హెచ్.ప్రభాకర్, జాయింట్ సెక్రటరీ కనకస్వామి, భాస్కర్‌రెడ్డి, సధానందం, యూజిన్, రవి.విజయ్, బాబు, రాజేందర్, డీటీసీఓ స్టాఫ్ కిరణ్, విజయ్ పాల్గొన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పూర్తిచేయాలి



పనులను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

ఖిలా వరంగల్: రూ.75కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని బీజేపీ తూర్పు నాయకుడు కుసుమ సతీష్ డిమాండ్ చేశారు. పార్టీ వరంగల్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో వరంగల్ 34వ డివిజన్ శివనగర్‌లో బీజేపీ నాయకులు సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నిధులతో రూ.75 కోట్ల వ్యయంతో మైసయ్యనగర్ అగర్త చెరువు నుంచి అండర్‌బ్రిడ్జి వరకు చేపట్టిన నిర్మాణ పనులు నెమ్మదిగా సాగుతున్నాయని అన్నారు. డ్రెయినేజీ నిర్మాణ పనులతో పైపులైన్లు ధ్వంసమై మూడేళ్లుగా స్థానికులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాకం హరిశంకర్, కనుకుంట్ల రంజిత్, బైరి శ్యాం, మాదాసి రాజు, సామల నిరంజన్, సుమన్, రంజిత్, మాచర్ల రవీందర్, ముత్తినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమంపై శ్రద్ధ



గ్యాస్ సిలిండర్ డోర్ డెలివరీ వాహనాన్ని ప్రారంభిస్తున్న సీపీ రంగనాథ్

కాజీపేట: విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే పోలీస్ సిబ్బంది సంక్షేమం పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తానని సీపీ డాక్టర్ ఏవీ.రంగనాథ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో గ్యాస్ సిలిండర్ డోర్ డెలివరీ వాహనాన్ని సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ఏఆర్ అదనపు డీసీపీ సంజీవ్, ఏసీపీలు నాగయ్య, అనంతయ్య, పోలీస్ సంక్షేమం ఆర్ఐ నగేష్, భాస్కర్, నవీన్, భానుప్రకాష్, స్వాతి, శోభన్, ఓదేలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



డాక్టర్ శ్రీధర్‌ను సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్స్

కాశిబుగ్గ: వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వరంగల్, హనుమకొండ సీనియర్ సిటిజన్స్ సభ్యులు కోరారు. ఈమేరకు ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డాక్టర్ అనిశెట్టి శ్రీధర్‌ను సోమవారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలనీల్లో, గ్రామాల్లో ఆయుర్వేద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వైద్యశాల అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసి ఆస్పత్రి అభివృద్ధి చేయాలని తెలిపారు. అనంతరం సూపరింటెండెంట్‌ను సన్మానించారు. ఇరు జిల్లాల సీనియర్ సిటిజన్స్ సభ్యులు తీరాల యుగేందర్, కోస్‌రెడ్డి మల్లారెడ్డి, వైద్యులు జగన్మోహన చారి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఆర్థిక చేయూతకు పరపతి సంఘాలు దోహదం

వరంగల్ చౌరస్తా: సభ్యుల ఆర్థిక చేయూతకు పరపతి సంఘాలు ఎంతగానో దోహదపడుతాయని రత్నగర్భ గణపతి పరపతి సంఘం అధ్యక్షుడు మీసాల ప్రకాశ్ అన్నారు. వరంగల్ దయానందకాలనీలో రత్నగర్భ గణపతి పరపతి సంఘం వార్షిక సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కార్యదర్శి కొత్తపల్లి గ్లాడిస్టన్ ప్రవేశపెట్టిన వార్షిక నివేదికకు సభ్యులకు ఆమోదం తెలిపారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

మామునూరు: ముందస్తు సంక్రాంతి సంబరాలను ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాల్లో డీన్ ప్రొఫెసర్ ఎస్ఎస్‌వీఎన్ శర్మ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో హాజరై రంగురంగుల ముగ్గులు వేశారు. అనంతరం ఫార్మసీ కళాశాల ఆవరణలో భోగి మంటలు ఏర్పాటు సందడి చేశారు.

సైన్స్‌ఫెయిర్‌లో 'సెయింట్ గ్యాబ్రియల్' ప్రతిభ

కాజీపేట రూరల్: వరంగల్ ప్లాటినం జూబ్లీ హైస్కూల్‌లో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో కాజీపేట సెయింట్ గ్యాబ్రియల్ స్కూల్ విద్యార్థులు బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ అరుణ్‌ప్రకాష్ తెలిపారు. పాఠశాలలో ఆగాఖాన్ ఎడ్యుకేషనల్ సర్వీస్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులను అభినందించారు. అలాగే, హనుమకొండ కపిల్‌హౌస్‌లో ఆదివారం నిర్వహించిన రంగోళి పోటీల్లో 10వ తరగతి విద్యార్థి భువనకృతి పాల్గొని ద్వితీయస్థానంలో నిలిచి రూ.3 వేలు నగదు బహుమతి సాధించినట్లు అరుణ్‌ప్రకాష్ తెలిపారు.

ఒలింపియాడ్‌లో అర్హత సాధించిన విద్యార్థులు

కాజీపేట: సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో తాళ్ల పద్మావతి స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి మూడవ స్థానంలో నిలిచారని తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం తెలిపారు. ఈమేరకు సోమిడి శివారులోని స్కూల్‌లో విద్యార్థులు బి.రియా, సిహెచ్.ఆద్య, హర్షిని, హనీష్, అలాగే, జాతీయ స్థాయి పరీక్షకు అర్హత సాధించిన తన్విష్ సాయి, నిష్ఖషితను సోమవారం అభినందించారు.

సీపీని కలిసిన ప్రెస్‌క్లబ్ కమిటీ

నయీంనగర్: వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్‌ను ఇటీవల ఎన్నికైన గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, కోశాధికారి బి.అమర్, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, ఈసీ మెంబర్లు పాల్గొన్నారు.

సీపీని కలిసిన రైల్వే పెన్షనర్స్ నాయకులు

కాజీపేట రూరల్: వరంగల్ సీపీ ఏవీ.రంగనాథ్‌ను కాజీపేట రిటైర్డ్ రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ సికింద్రాబాద్ నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

డ్రెయినేజీ నిర్మించాలని వినతి

హన్మకొండ చౌరస్తా: సుందరయ్యనగర్ నుంచి కేయూ రోడ్డు వరకు గతేడాది మంజూరైన సైడ్ డ్రెయినేజీ నిర్మించాలని హనుమాన్‌నగర్ కాలనీవాసులు కోరారు. ఈమేరకు వరంగల్‌లోని గ్రేటర్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌సెల్‌లో బల్దియా కమిషనర్ ప్రావీణ్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు.

19న పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లపై సమీక్ష

వరంగల్ రూరల్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖలకు చెందిన పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌లపై ఈనెల 19న కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వరంగల్ కలెక్టర్ గోపి అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ షేక్ జహీరుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు.

డీపీఓగా బాధ్యతల స్వీకరణ

వరంగల్ రూరల్: వరంగల్ జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ)గా కట్కం కల్పన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఇన్‌చార్జ్ డీపీఓ, డీఆర్‌డీఓ సంపత్‌రావు నుంచి బాధ్యతలు స్వీకరించగా, ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ఉచిత విద్యుత్‌ను వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న డీఈ మల్లికార్జున్

మామునూరు: ఎస్సీ, ఎస్టీలకు 100 యూనిట్లలోపు ప్రభుత్వం ఉచితంగా అందించే కరెంట్ సరఫరాను వినియోగించుకోవాలని, అందుకు కావాల్సిన కుల సర్టిఫికెట్, ఆధార్‌కార్డును సమర్పించి ఉచిత కనెక్షన్ పొందాలని విద్యుత్‌శాఖ డీఈ మల్లికార్జున్ సూచించారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట గ్రామంలో విద్యుత్‌శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీలకు ఉచిత కరెంట్ కనెక్షన్లపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం నేరమని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు పసునూరి వజ్రయ్య, ఎస్ఏఓ డి.సంజీవరావు, ఏఏఓ కమలాకర్, ఏడీఈ ఎం.సర్వేశ్వర్, ఏఈ సురేందర్, రమేష్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగరాజ ఉత్సవాలను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వాణి, కార్పొరేటర్లు

వరంగల్ చౌరస్తా: సద్గురు త్యాగరాజస్వామి 176వ ఆరాధనోత్సవాలను జయప్రదం చేయాలని నన్నపునేని ట్రస్టు చైర్మన్ నన్నపునేని వాణి కోరారు. వరంగల్ స్టేషన్‌రోడ్డులోని రాధాకృష్ణ (మహేశ్వరి) గార్డెన్‌లో త్యాగరాజస్వామి ఉత్సవాల వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 11నుంచి 13వరకు జరగనున్న ఆరాధనోత్సవాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గందె కల్పన, గుండేటి నరేంద్రకుమార్, దిడ్డి కుమారస్వామి, భద్రకాళి దేవస్థానం ప్రధాన అర్చకుడు శేషు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమికి రమేష్ బాబు, బీఆర్ఎస్ నాయకులు దుబ్బ శ్రీనివాస్, చింతాకుల అనిల్, గోరంటల మనోహర్, నవీన్, జారతి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీ.. తాగునీరు వృథా





రుద్రమాంబ ఫిల్టర్ నుంచి కేసీ క్యాంప్‌నకు ఏర్పాటుచేసిన పైపులైన్ ధ్వంసమై లీకైంది. దాంతో నాలుగు రోజులుగా తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. పలివేల్పుల బ్రిడ్జి, ఎస్సార్ ప్రధాన కాల్వల వద్ద పైపులైన్ దెబ్బతినడంతో క్యాంప్‌లో నీటి సమస్య ఏర్పడగా, అధికారులు స్పందించాలని కోరుతున్నారు. - హసన్‌పర్తి

ఎల్‌బీ కళాశాల కేడెట్ల పునీత్‌సాగర్ అభియాన్



విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

రామన్నపేట: నగరంలోని లాల్‌బహదూర్ కళాశాలలో ఎన్‌సీసీ పదవ బెటాలియన్ కమాండెంట్ అధికారి కల్నల్ అజయ్‌నంద ఖాండూరి, ఏఓ మహేష్‌కుమార్ సూచనల మేరకు పునీత్‌సాగర్ అభియాన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలోని స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలు, ములుగు రోడ్డును ఎన్‌సీసీ కేడెట్లు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రకృతిలో పేరుకుపోయిన చెత్తాచెదారం, తాగునీటి సరస్సులు, మలినాన్ని శుద్ధి చేసి ఆరోగ్యవంతమైన సమాజానికి ప్రతీఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ ఎం.సదానందం, అనిల్‌కుమార్, నరేష్, పవన్, నాగరాజు, నేహశ్రీ, అంజలి, చందన, ఓంశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

బీసీ జనగణన అన్ని రాష్ట్రాల్లో చేపట్టాలి



ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

హన్మకొండ: బీసీ జనగణనను దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో చేపట్టాలని బీసీ జనగణన సాధన సమితి, కోటి ఉత్తరాల ఉద్యమకర్త పరికిపండ్ల అశోక్ అన్నారు. బిహార్ రాష్ట్రంలో బీసీ జనగణన చేపట్టడం అభినందనీమని అన్నారు. ఈమేరకు హనుమకొండలో సోమవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా గణనలో బీసీల కాలం చేర్చాలనే డిమాండ్‌తో దేశవ్యాప్త కోటి ఉత్తరాల కార్యక్రమం మొదలు పెట్టినట్లు చెప్పారు. తెలంగాణతో పాటు, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో అవగాహన సదస్సు నిర్వహిస్తూ ఉత్తరాలు బట్వాడా చేస్తూ, ఇటీవల ఢిల్లీకి వెళ్లి అన్ని పార్టీల పార్లమెంట్ మెంబర్లు, కేంద్రమంత్రులను కలిసి వినతి పత్రాలు ఇచ్చినట్లు వివరించారు. ఇప్పటివరకు 20లక్షల ఉత్తరాలు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి చేరినట్లు సమాచారం ఉందని అశోక్ తెలిపారు. బీసీ జనగణన సాధన సమితి రాష్ట్ర సభ్యులు ఆడెపు సుధాకర్, విద్యాసాగర్, వైద్యులు డాక్టర్ రాజేంద్రప్రసాద్, పద్మ, నాయకులు కృష్ణశాస్త్రి, వికాస్, ప్రవీణ్, నర్సయ్య, వేణు, ఇమామ్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై వాహన తనిఖీలు



వరంగల్ ఆర్టీఏ జంక్షన్ సమీపంలో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు



కాజీపేట జంక్షన్‌లో..

ఖిలా వరంగల్: వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై నాయుడు పెట్రోల్‌బంక్ సమీపంలో మామునూరు ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో ఎస్సై కృష్ణవేణి నేతృత్వంలో స్పెషల్ పార్టీ పోలీసులు సోమవారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. చైన్‌స్నాచింగ్ ముఠాలను పట్టుకునేందుకు తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. అనుమానితులు కనిపిస్తే 100 నంబర్‌కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. తాళం వేసి ఉన్న ఇళ్లు, రోడ్లపై ఒంటరిగా నడిచే మహిళలే లక్ష్యంగా దొంగలు చోరీలకు తెగబడుతున్నారని పేర్కొన్నారు.

కాజీపేట జంక్షన్‌లో..

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో కాజీపేట సివిల్ పోలీసులు సోమవారం తెల్లవారు జామున తనిఖీలు చేపట్టారు. చైన్ స్నాచర్స్‌ను పట్టుకోవడంలో భాగంగా కాజీపేట ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాజీపేట సీఐ గట్ల మహేందర్‌రెడ్డి, ఎస్సైలు రవికుమార్, ప్రమోద్‌కుమార్, శ్వేత, సిబ్బంది కలిసి రైల్వే స్టేషన్‌లో, స్టేషన్ ముందు సర్క్యులేటింగ్ ఏరియాను క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమానాస్పదంగా కనిపించిన ప్రయాణికులను తనిఖీలు చేసి వివరాలు సేకరించారు.

ఫాదర్ జెరోమ్ సేవలు అభినందనీయం



ఫాదర్ జెరోమ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సీతక్క

కాజీపేట రూరల్: ఆధ్యాత్మిక సేవలతో పాటు మానసిక వికలాంగులకు సేవలందిస్తున్న ఫాదర్ తానుగుండ్ల జెరోమ్ అభినందనీయలని ములుగు ఎమ్మెల్యే సీతక్క ప్రశంసించారు. రాష్ట్రస్థాయి సాంఘిక సేవా అవార్డు గ్రహీత ఫాదర్ జెరోమ్‌కు కాజీపేట ఫాతిమానగర్ పాస్టల్ సెంటర్‌లో సోమవారం రాత్రి రెడ్డి క్యాథలిక్ సంఘం ఆధ్వర్యంలో అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మత స్వేచ్ఛ.. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని అన్నారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మథ్యాస్‌రెడ్డి, అల్లం ప్రకాష్‌రెడ్డి, ఫాదర్ విజయపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మర్రెడ్డి, సుధాకర్ రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి కటకం కిరణ్‌రెడ్డి, బాలస్వామి రెడ్డి, బాలశౌరిరెడ్డి, జాన్సన్, బి.దయాసాగర్, అరూరి రమేష్ పాల్గొన్నారు. అలాగే, కాజీపేట ఫాతిమా సర్వప్రేమ సొసైటీ ఆధ్వర్యంలో వరంగల్‌కు చెందిన నిరుపేదరాలు స్వర్ణకు కట్టుమిషన్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు.